క్లుప్తంగా

పోస్టల్ ఉద్యోగులకు బోనస్ ప్రకటించాలి



నిరసన తెలుపుతున్న తపాలా ఉద్యోగులు

రాజమహేంద్రవరం సిటీ: పోస్టల్ ఉద్యోగులకు దసరా బోనస్‌ను ఇంకా ప్రకటించకపోవటాన్ని నిరసిస్తూ అఖిల భారత తపాలా ఉద్యోగ సంఘాల పిలుపు మేరకు రాజమహేంద్రవరం పోస్టల్ డివిజనల్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం తపాలా డివిజన్ గ్రూప్ సి యూనియన్ కార్యదర్శి బి.కొండ బాబు మాట్లాడుతూ దసరా ముందు ఉద్యోగులకు చెల్లించాల్సిన బోనస్‌ను ఇంకా ప్రకటించకపోవటం దుర్మార్గమన్నారు. కావాలనే కేంద్ర ప్రభుత్వం ఆలస్యం చేస్తోందన్నారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు యూజీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అంతరాయం

కడియం: వార్షిక మరమ్మతుల నేపథ్యంలో వేమగిరి విద్యుత్ సబ్ స్టేషన్‌కు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఆపరేషన్స్) దాట్ల శ్రీధర్ వర్మ ప్రకటనలో తెలిపారు. కడియం, వేమగిరి, జేగురుపాడు, కడియపుసావరం గ్రామాలకు సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

యూటీఎఫ్ దీక్షలు ప్రారంభం

కంబాలచెరువు: ఓపీఎస్ సాధనకై ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి నిరవధిక నిరాహార దీక్షలు యూటీఎఫ్ కార్యాలయం వద్ద బుధవారం ప్రారంభమయ్యాయి. వీటిని ముత్తారావు ప్రారంభించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.అరుణ్ కుమారి మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరిస్తామన్న పార్టీకే ఓటు వేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయులను కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.షరీఫ్ మాట్లాడారు.

29న విజయవాడలో ఏపీటీఎఫ్ ధర్నా

కంబాలచెరువు: విజయవాడలో ఈనెల 29న ఏపీటీఎఫ్ 1938 తలపెట్టిన రాష్ట్ర ధర్నాను విజయవంతం చేయాలని ఆ శాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ అన్నారు. ఆయన బుధవారం గోకవరం బస్టాండ్ వద్దనున్న అంబేడ్కర్ కూడలిలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పోస్టర్లు ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యదర్శి ఏ.ఉదయ బ్రహ్మం, రాష్ట్ర మాజీ కార్యదర్శి వఝుల అప్పయ్య శాస్త్రి, జిల్లా అధ్యక్షుడు పింగళి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోగి అదృశ్యం

కంబాలచెరువు: రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి అదృశ్యమైన సంఘటనపై మూడో పట్టణ పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏఎస్ఆర్ జిల్లా మోతుగూడేనికి చెందిన కె.బలరామ్ అనారోగ్యంతో నాలుగు రోజుల క్రితం ప్రభుత్వాసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. అతడు అదృశ్యం కావడంతో కుమార్తె కమల మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

25 కేజీల గంజాయి పట్టివేత

కంబాలచెరువు: కారులో తరలిస్తున్న 25 కేజీల గంజాయిని ప్రకాశం నగర్ పోలీసులు బుధవారం పట్టుకుని, నలుగురిని అరెస్టు చేశారు. ఏజెన్సీ నుంచి విజయవాడకు గంజాయి తరలిస్తున్నారన్న సమాచారంతో లాలాచెరువు సర్వీస్ రోడ్డులోని మోడల్ కాలనీ వద్ద పోలీసులు నిఘా ఉంచారు. ఆ కారును పట్టుకుని, అందులో 25 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడుకు చెందిన కృష్ణస్వామి, విజయవాడకు చెందిన బి.దుర్గాప్రసాద్, నగరానికి చెందిన ఎస్.మౌళీ, బి.అప్పారావును అరెస్టు చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్ చోరీ

కంబాలచెరువు: స్థానిక పీఅండ్‌టీ కాలనీలోని ఓ ఇంటిలో రెండు సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌ను దొంగలు చోరీ చేశారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్న జి.శ్రీనివాస్ అయ్యప్ప దీక్షలో ఉన్నాడు. పూజ అయిన తర్వాత ఇంటిలో నిద్రిపోయాడు. మర్నాడు ఉదయం లేచి చూసేసరికి సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్ మాయమయ్యాయి. అతను బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న సురక్షతో అందరికీ ఆరోగ్యం

- కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- వైద్యశిబిరంలో పలువురికి సేవలు

రాజమహేంద్రవరం రూరల్: ప్రజలందరికీ ఆరోగ్యం అందించాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. పిడింగొయ్యి గ్రామసచివాలయం–1 పరిధిలో కవలగొయ్యి జీఎస్ఎం లా కళాశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆయన, సచివాలయ కన్వీనర్లతో కలిసి ప్రారంభించారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి నాణ్యమైన వైద్యసేవలు అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం పేద ప్రజలకు వైద్యపరంగా భరోసా అందిస్తోందన్నారు. స్పెషలిస్టు వైద్యులు షణ్ముఖ వర్మ, శ్రీదేవి, ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సుధాకర్ ఆధ్వర్యంలో డాక్టర్లు జి.రోహిత, ఈ.నాగదేవి వైద్యసేవలందించారు. శిబిరంలో 502 మంది వైద్యసేవలు పొందగా 10 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫరల్ చేశారు. రూరల్ తహసీల్దార్ పైడి చిన్నారావు, ఈవోపీఆర్‌అండ్‌ఆర్డీ తాడి కృష్ణ, పంచాయతీ కార్యదర్శి రూప్‌చంద్, మాజీ ఎంపీపీ రేలంగి వీర వెంకట సత్యనారాయణ, హుకుంపేట సొసైటీ చైర్‌పర్సన్ బొప్పన సుబ్బారావు, సచివాలయ కన్వీనర్లు జాజుల శ్రీను, తీగిరెడ్డి శ్రీను, మారిశెట్టి వెంకన్న, వేముల ఏసుబాబు, ఏ.దుర్గారావు, ఎం.రమణ, పడాల వీర రాఘవరెడ్డి, శంకర్, పల్లేటి చిన్నబాబు పాల్గొన్నారు.



పిడింగొయ్యిలో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న చందన నాగేశ్వర్



కడియపుసావరంలో సేవలు అందిస్తున్న వైద్యులు

585 మందికి వైద్యసేవలు

కడియం: కడియపుసావరం –1 గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని బుధవారం ఎంపీడీవో కె.రత్నకుమారి, సచివాలయ కన్వీనర్లతో కలిసి ప్రారంభించారు. శిబిరంలో 585 మందికి వైద్య పరీక్షలు చేశారు. 16 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫరల్ చేశారు. స్పెషలిస్టు వైద్యులు ఉజ్వల, డాక్టర్ పూర్ణిమ, పీహెచ్‌సీ వైద్యులు జ్యోత్స్న, ఎస్ఎస్ఎస్ మౌర్య, స్వరూప వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో ఎంఈవో లజపతిరాయ్, మాజీ సర్పంచ్ సాపిరెడ్డి సూరిబాబు, సచివాలయ కన్వీనర్లు సాపిరెడ్డి వీరదుర్గ కామేష్, జ్యోతుల హరికృష్ణ, శీలం నరసింహ పాల్గొన్నారు.



అంబేడ్కర్ నగర్ శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అనుసూరి పద్మలత

వైద్య సేవల్లో విప్లవాత్మక మార్పులు

కంబాలచెరువు: వైద్యసేవల్లో విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ అనుసూరి పద్మలత అన్నారు. స్థానిక తాడితోట సెంటర్ సమీపంలోని అంబేడ్కర్ నగర్‌లో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆమె సందర్శించారు. రోగులను స్వయంగా పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఈ బృహత్తర కార్యక్రమం చేపట్టారన్నారు. గుండెపోటు వచ్చిన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాలకు తరలించే సమయంలో రూ.40 వేల ఖరీదైన త్రంబోలసిస్ ఇంజెక్షన్ చేయాల్సి ఉంటుందని, దానిని ప్రతి పీహెచ్‌సీలో అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి సత్యవతి, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి బురిడి త్రిమూర్తులు, సచివాలయం అడ్మిన్ రియాజ్, ప్రత్యేకాధికారి రవిలక్ష్మణ్, ఆరోగ్య కార్యదర్శి కనకరత్నం, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

హాస్పిటళ్లలో నిబంధనలు తప్పనిసరి

- లేకుంటే కఠిన చర్యలు
- కలెక్టర్ మాధవీలత

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రులలో ప్రజారోగ్య సంరక్షణపై చట్టపరమైన ప్రభుత్వ విధివిధానాలను తప్పని సరిగా పాటించాలని కలెక్టర్ డాక్టర్ మాధవీలత అన్నారు. వాటిలో ఏ విధమైన లోపాలున్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఆమె అధ్యక్షతన వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా స్థాయి సలహా మండలి కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే తనిఖీలు నిర్వహించిన ఆసుపత్రులకు సంబంధించి ఎటువంటి చర్యలు తీసుకున్నారో నివేదిక రూపంలో అందచేయాలని స్పష్టం చేశారు. జిల్లా వైద్యగణాంకాధికారి జె.కుమారస్వామి మాట్లాడుతూ జిల్లాలోని 73 హాస్పిటళ్లలో ఇప్పటికే కొన్ని హాస్పటళ్లు, ల్యాబ్‌లలో తనిఖీలు నిర్వహించామన్నారు. లోపాలు గుర్తించిన వాటికి నోటీసులు జారీ చేశామని తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నాలుగు బృందాలుగా ఏర్పడి జిల్లాలోని 428 హాస్పిటళ్లను తనిఖీ చేసినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ పి.లక్ష్మీదేవి, జిల్లా కుష్ఠ, క్షయ, ఎయిడ్స్‌నియంత్రణ అధికారి డాక్టర్ వసుంధర, ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ (అప్నా) ప్రెసిడెంట్ డాక్టర్ విజయ్ కుమార్, ఐఎంఎస్ సెక్రటరీ డి.సతీష్, డీఆర్‌డీఏ పీడీ కె.వీణాదేవి, డిప్యూటీ జిల్లా గణాంక అధికారి భాస్కర్ పాల్గొన్నారు.

సమస్యాత్మక వీధుల్లో సీసీ కెమెరాలు

- ఆకతాయిల కదలికలపై నిఘా
- సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని సమస్యాత్మక వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక 30వ డివిజన్‌లో ఇన్‌చార్జి మజ్జి నూకరత్నం ఆధ్వర్యంలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ఈ విధంగా అనుసంధానం చేస్తే ఆకతాయిలు, పెడదారి పట్టిన యువకుల కదలికలపై పోలీసు నిఘా ఉంటుందన్నారు. అలాగే వీధులలో కొన్ని మౌలిక సమస్యలను ఆయన అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి క్షేత్రస్థాయిలోనే పరిష్కరించారు. డివిజన్ పరిధిలోని తోట వీధి, చింతలపేట, అన్నపూర్ణమ్మ పేట, మదన్ సింగ్ పేటల్లో పర్యటించారు. పూర్వం నిర్మించిన చిన్న డ్రెయినేజీలను ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా విస్తరించాలన్నారు. అశోక థియేటర్ వెనుక ప్రహరీ పక్కనే గాజు సీసా పెంకులు, చెత్తా చెదారం పేరుకుపోయిన ప్రాంతాన్ని వెంటనే శుభ్రం చేయించాలన్నారు. స్వామి థియేటర్ పక్కన అశోక థియేటర్ వెనుక ప్రాంతంలో ఉన్న రోడ్డులో గంజాయి తాగుతున్న యువకులు తిరుగుతున్నారని, ఆకతాయిల ఆగడాలు ఎక్కువయ్యాయని స్థానికులు వాపోయారు. ఆ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం డివిజన్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. వైఎస్సార్ సీపీ క్లస్టర్ ప్రెసిడెంట్ మజ్జి అప్పారావు, మాజీ కార్పొరేటర్ నల్లా రామాంజనేయులు, ఎస్కే మస్తాన్, ఓంకార్ పాల్గొన్నారు.



డివిజన్‌లో పర్యటిస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

ట్రస్ట్‌బోర్డు డైరెక్టర్లను నిర్లక్ష్యం చేస్తే సహించం

సీటీఆర్ఐ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించిన ట్రస్ట్ బోర్డు డైరెక్టర్లలను నిర్లక్ష్యం చేసి, అవమాన పరిస్తే సహించేది లేదని గౌతమీ జీవ కారుణ్య సంఘం చైర్మన్ బర్రే కొండబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. నారాయణపురం ఎదురుగా ఉన్న గౌతమీ జీవకారుణ్య సంఘ ఆశ్రమ ప్రాంగణంలో ఆయన అధ్యక్షతన బుధవారం సాయంత్రం అత్యవసర పాలకమండలి సమావేశం నిర్వహించారు. వంట మనిషిని ఉద్యోగం నుంచి తొలగించిన దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి నిర్ణయంపై చైర్మన్, డైరెక్టర్లు తీవ్ర అభ్యంతరం తెలిపారు. వంట మనిషి రాజీనామా లేఖకు ఈవో చెప్పిన విషయాలకు పొంతన లేదన్నారు. బోర్డుకు తెలియకుండా సిబ్బందిని తొలగించడం, ఇష్టం వచ్చినట్లు కొత్తవారిని నియమించడం వంటి సొంత నిర్ణయాలు అమలు చేసి, ట్రస్ట్ బోర్డ్ సభ్యులకు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం ప్రభుత్వం నియమించిన పాలకమండలిని అవమానించడమే అన్నారు. బడ్జెట్ కేటాయింపుల గురించి డైరెక్టర్లు అడిగే వరకు ఒక్కమాట కూడా తెలియనివ్వకపోవడం సరికాదన్నారు. సమావేశంలో డైరెక్టర్లు అడిగిన ఏ ప్రశ్నలకు సరైన జవాబు రాలేదని నిరాశ వ్యక్తం చేశారు.కారుణ్యానంద స్వామి నలుగురి పొట్టనింపేందుకే ఆశ్రమాన్ని స్థాపించారు కానీ, అకారణంగా పొట్ట కొట్టేందుకు కాదన్నారు. సిబ్బందికి ఇచ్చిన నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఈవోకు సూచించారు. నలుగురు డైరెక్టర్లతో కూడిన కమిటీని ఏర్పాటు చేసి సంస్థలో జరుగుతున్న ఆర్థిక లావాదేవీలను, అకౌంట్ వివరాలను పరిశీలించడానికి నిర్ణయం చేశారు. సమావేశంలో బోర్డు డైరెక్టర్లు బత్తిన అన్నవరం, అడపా రఘు, నాగులాపల్లి దేవి లక్షణరావు, తమ్మిశెట్టి రాధిక ప్రభాస్, పైడా ఉషా, చొల్లంగి ఏడుకొండలు, చిట్టాబత్తుల అనంత లక్ష్మీరాజు, పిల్లి నాగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కొండబాబు

వ్యక్తి ఆత్మహత్య

ధవళేశ్వరం: స్థానిక రాజీవ్ కాలనీకి చెందిన సమనసి శ్రీనివాస్ (35) ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ధవళేశ్వరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ రాజమహేంద్రవరం హోండా షోరూమ్‌లో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. మూడేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకున్నప్పటికీ తగ్గలేదు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి ఇంటికి వచ్చిన శ్రీనివాస్ లోపలకు వెళ్లి తలుపు వేసుకున్నాడు. అతడు ఎంతకీ బయటకు రాకపోవడంతో తల్లి, భార్య స్థానికుల సాయంతో తలుపు తెరిచి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఉన్నాడు. శ్రీనివాస్‌ను హుటాహుటీన కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎస్సై క్రాంతి కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిథున్‌రెడ్డికి ఘన స్వాగతం

రాజమహేంద్రవరం రూరల్: రాజంపేట ఎంపీ, లోక్‌సభ పార్లమెంటరీనేత, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి బుధవారం వేమగిరి సెంటర్‌లో ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చందన మిథున్‌రెడ్డికి క్రేన్ సహాయంతో భారీ గజమాల వేశారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎంపీ మార్గాని భరత్ రామ్, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రుడా మాజీ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, పాలిక శ్రీను పాల్గొన్నారు.



వేమగిరి సెంటర్‌లో మిథున్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు

సినిమాలు

శ్యామల	:	లియో
సూర్యమినీ	:	టైగర్ నాగేశ్వరరావు
సూర్యప్యాలెస్	:	భగవంత్ కేసరి
స్వామి	:	టైగర్ నాగేశ్వరరావు
శివజ్యోతి	:	లియో
అనుశ్రీ	:	భగవంత్ కేసరి
రాజా	:	టైగర్ నాగేశ్వరరావు
అశోక	:	భగవంత్ కేసరి
ఊర్వశి	:	టైగర్ నాగేశ్వరరావు
మేనక	:	మేడ్
అప్సర	:	లియో
నామవరం		
వీఎస్ మహల్	:	టైగర్ నాగేశ్వరరావు
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	భగవంత్ కేసరి, లియో
కడియం		
వెంకట సూర్య	:	టైగర్ నాగేశ్వరరావు

బీఎస్ఎన్ఎల్ సేవాకేంద్రం ప్రారంభం



సేవాకేంద్రాన్ని ప్రారంభిస్తున్న జీఎం రాజు తదితరులు

సీటీఆర్ఐ: బీఎస్ఎన్ఎల్ ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలందించేందుకు వినియోగదారుల సేవాకేంద్రాన్ని ప్రారంభించినట్టు జీఎం పలివెల రాజు అన్నారు. గోకవరం బస్టాండ్ వద్ద గల నన్నయ సంచార భవనంలో బుధవారం కస్టమర్ డిలైట్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారులకు మరిన్ని విస్తృత సేవలు అందించేందుకు ఈ సెంటర్ దోహద పడుతుందన్నారు. పలు రకాలైన సేవలను వినియోగించుకుని, సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాలలో కొత్తగా ఆరు నెలలకు కేవలం రూ.999 లకే ఫైబర్ నెట్ ప్లాన్ అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు. కార్యక్రమంలో డీజీఎంలు రాజశేఖర్ బాబు, సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దైవ నామస్మరణతో ఆనందమయ జీవితం

రంగంపేట: నిరంతర దైవ నామస్మరణతో ఆనందమయ జీవితం పొందవచ్చని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బలుసు వెంకటేశ్వర్లు అన్నారు. ఇందుకోసమే సత్య సాయి భజనామృత కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా చేపట్టామని చెప్పారు. స్థానిక సత్యసాయి సేవా కేంద్రంలో నిర్వహించిన 11వ సత్యసాయి గానామృతం 9 గంటల భజన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సాయి బాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టామని, ఈ నెల 29న రాజమహేంద్రవరం ఆల్కాట్‌గార్డెన్స్ వద్ద ఉన్న సాయి మందిరంలో ముగింపు ఉంటుందన్నారు. ఈ నెల 28, 29 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర యువజన సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సత్యసాయి పాదుకలకు, చిత్ర పటాలకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సేవాదళ్ కన్వీనర్ బిక్కిన రామలక్ష్మి, జోనల్ కన్వీనర్ సీహెచ్ త్రిమూర్తులు, జిల్లా విద్యా విభాగ సమన్వయకర్త ఎల్.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.



రంగంపేట సాయి మందిరంలో పూజలు చేస్తున్న దృశ్యం

గౌరీదేవి అలంకరణ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

రాజానగరం: దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా చక్రద్వారబంధంలోని దేవీచౌక్ వద్ద బుధవారం గౌరీదేవి అలంకరణ పోటీలు నిర్వహించారు. ఉత్తమ అలంకరణగా గుర్తించిన నాలుగు అలంకరణలకు గాది సూరిబాబు, వీరమణి దంపతుల సహకారంతో పసుపు, కుంకుమ భరిణిలను అందజేశారు. అలాగే ఆలయానికి పక్కనే న్న కొలనులో సాయంత్రం జగన్మాతకు తెప్పోత్సవం నిర్వహించారు.

కన్నులపండువగా కనకదుర్గమ్మ ఊరేగింపు



కనకదుర్గమ్మ ఊరేగింపులో గరగ నృత్యాలు, శక్తివేషాలు

గోకవరం: స్థానిక వీరభద్రునిగడ్డలో వెలసిన కనకదుర్గమ్మ ఊరేగింపు బుధవారం కన్నులపండువగా జరిగింది. శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని పూల రథంపై ఊరేగించారు. ఊరేగింపులో గరగ నృత్యాలు, నవదుర్గ నృత్యాలు, చిన్నారుల కోలాటం, కేరళ డప్పులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్థానిక ఆంజనేయస్వామి గుడి సెంటర్ నుంచి ప్రధాన రహదారిపై పంచాయతీ కార్యాలయం వరకూ ఊరేగింపు జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కాగా శుక్రవారం ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కంబాల శ్రీనివాస్‌రావు, పద్మావతి దంపతుల సహకారంతో అన్నదానం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.